స్కెచ్

# నవీన వీరనారి

"సాదా"

కుమారి కృష్ణాభాయ్ కామినీ పూర్ణతిలక మెట్రిక్ ప్యాసై యేరోజైతే కాలేజీలో ప్రవేశించిందో ఆనాడే కాలేజీ వాతావరణంలో చిన్న గాలిదుమారం రేగింది. ఆనాటినుండి ఆమె పేరు అతి ప్రయాసతో సంగ్రహించిన విద్యార్థి బృందం ఆమెను మిస్ లతికగా పిలువ దల్చుకున్నారు.

లతిక యేమంత చెప్పుకోదగ్గ సౌందర్యవతి కాదు. కాని ఆమె రూపంలో యేదో అవ్యక్తమైన ఆకర్షణాశక్తి దోబూచులాడుతూ వుంటుంది. ఆమెదొక ప్రత్యేక సౌందర్యం! ఆమె ముక్కు కేవలం చిన్నదికాదు. అయినా పెద్దదనటానికి వీల్లేదు. చివరను చిన్నవంపు తిరిగి హిందూస్థానీ స్థాయిలో ఉంటుంది. ఆమె కళ్లు పెద్దవికావు. కాని చిలిపితనం వాటిల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఆ ముగ్ధ సౌందర్యంలోని ఆకర్షణకు తోడు ఆమె చలాకీతనం వన్నెపెట్టినట్లుంటుంది. అయితే ఆమె తప్ప యితర అమ్మాయిలు కాలేజీలో లేరనికాదు.

కాలేజీలో అడుగు పెడుతూనే ఆమె సౌందర్యపు పాటను అనధికారంగా ఆమెకు వినిపించిన పెంకి కుర్రాడిని నిలువునా మాంతమార్చింది. ఆ సంఘటనతో ఆ స్త్రీలో ఉన్న మగతనం కాస్త నలుగురికీ రుజువయింది.

అయితే ఆమె మగవాళ్ళను చాలా నీచదృష్టితో చూస్తుంది. వాళ్లు ఉత్త "మృగాలు" "పశువులు" అంటుంది. మధ్యమధ్య స్నేహితురాళ్ళతో

ఆమెలో చదువుకునే ఆసక్తికన్నా పెంకితనం చేసేమగవాళ్ళకు బుద్ధిచెప్పే ప్రయాస అమ్మాయిలు అందరి తరఫునా తనమీదే ఉన్నదనే భావం మెండుగా కనిపిస్తుంది.

తమ తండ్రి తాతలు గడించిన ఆస్తి రకరకాలగా తగలబెట్టి శేషించిన దానితో కొడుకుల్ని తమంత వాళ్లుగాచేసే కట్టుదలతో పట్నాలకు చదువుకు పంపగా వచ్చిన రాజు, రాధాబాబు, సంగమేశ్వరం — దీనబంధు బాబుగారి సుపుత్రుడు రఘూనాధు, వీళ్ళకితోడు స్పోర్ట్స్‌మేన్ వీరాస్వామి, యెప్పుడూ ఆవిడ యోగక్షేమాల ప్రసక్తితోనే జీవిస్తూ ఉంటారు. రాజు గుర్రపు బగ్గీమీద రాధాబాబు స్వంత కారుమీద, సంగమేశ్వరం ర్యాలీ సైకిల్ మీద, రఘునాథ్ అద్దె బండీలోనూ కాలేజీకి వస్తారు. వీళ్ళలో ఎవరో ఒకరు వంతు వేసుకొని వీరాస్వామిని కాలేజీదాకా తెస్తారు. వీరాస్వామి ఆరోజు క్లాసులో తన దేహారోగ్యానికి సరిపడని పాఠాలేమన్నా వుంటే అసలు కాలేజీకి రావటమే మానివేస్తాడు. మిగతా వాళ్ళంతా శుభ్రంగా 'టాయిలెట్' అయి, చేతిలో మోతాదుగా ఒకటి రెండు ఖరీదైన ఫైల్సు పట్టుకొని తమ దుస్తుల రాపిడిలో బహిర్గతమయ్యే సెంటు, హెయిర్ ఆయిల్, స్నో, పౌడర్ల ఘుమఘుమలతో క్లాసు రూమంతా నింపేస్తారు. వీళ్ళకూ కాలేజీలో ప్రిన్సిపాల్ దగ్గఱనుంచి డెమాన్‌స్ట్రేటర్ దాకా ఎవ్వరో ఒక "గాడ్‌ఫాదర్" సంరక్షకుడు నామకః వుంటాడు. అందుచేత ఒక్కొక్కప్పుడు క్లాసులో లేకనాయినా హాజరుమార్కు పడడం కద్దు. క్లాసులో కూచున్నది మొదలు అమ్మాయిలను శల్యపరీక్ష చేస్తూ వీలైనప్పుడల్లా తమ ఉనికి వల్ల చదువుమీద శ్రద్ధ వుండే వాళ్ళకు, చదువు చెప్పే లెక్చరర్లకు వెగటు, యిబ్బంది కలుగచేస్తున్నామనే సంకోచం లేశమైనా లేకుండా మోటుగా ప్రవర్తిస్తారు.

భావి ఆంధ్రలోకాన్ని ఉద్ధరించబోయే యీ యువతీ యువకులను భగవంతుడు రక్షించుగాక!

ఇంతకీ లతికమాట చెప్పడము మరచాను. ఒక ప్రక్క యింత చురుకుగా, పెంకిగా తిరుగుతున్నా ఆమెకు మార్కులు బాగానే రావడమూ పరీక్షల్లో ప్యాసుకావడమూ సంభవించేది. మరి అదే అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసేది. ఆమె కాసుకి అలసంగా-

రావటమే కాకుండా 'టక్ టక్' మని సైఫీల్డ్ షూస్‌తో కృత్రిమ మృదంగం వాయిస్తూ, హుందాగా లెక్చరర్ గారి కుర్చీ వెనుకగా 'మార్చి పాస్టు' చేస్తూ అవతలప్రక్క గరల్స్ మధ్యగా తన ఆసనం అలంకరించేది!

ఇది చూసిన వెంటనే గేలరీ క్లాసులో పైన వున్న స్టూడెంట్లు తమ తమ అభిప్రాయాలను —నేపథ్యంలో—భిన్నాభిన్నంగా కలవరపాటుతో సూచించేవారు. అంతవరకు వారిలో నిర్లిప్తంగా వున్న తాళజ్ఞానం తలయెత్తి ఆమె పదవిన్యాసాని కనుగుణంగా 'లయ'వేసే భావం అంకురించేది, మిలిటరీ బాండును అనుకరిస్తూ. లెక్చరర్ గారి గద్దింపుతో మళ్ళీ నిశ్శబ్ద వాతావరణం యేర్పడడం మామూలయింది.

ఆమె యూనివర్సిటీ మీటింగుల్లో, డిబేటింగ్ సొసైటీలలో, కాలేజీ డ్రామాల్లో, స్పోర్ట్సులో ఒకటేమిటి?—అన్ని రకాల ఉద్యమాల్లో పాల్గొని మెఱుపు తీగెలాగ చకచక తిరిగేది. అనుభవం, తెలివితేటలూ, చదువుతో పాటు ఆమెకు పెడసరం కూడా కొంచెం ఎక్కువైంది. అది కొంతమందికి వెగటు కలిగించినా ఆమెలో అది సహజలోపంగా పరిగణించేవారు.

ఒక మారు స్టూడెంట్లూ లెక్చరర్లూ కలిసి దూరంగా కొండల్లోకి, ఒక ఫ్లాగ్ స్టేషన్ వద్ద దిగి ఎక్స్‌కర్షన్‌కోసం వెళ్ళారు. తిరిగి వస్తుండగా రైలు పెట్టెల్లో జాగాలేనందున ఎవరికి తోచిన పెట్టెలో వాళ్ళు యెక్కి పోయారు. కొంతమంది గరల్స్, బాయ్ స్టూడెంట్లూ మాత్రం లతికతో పాటే యెక్కారు.

ఆ పెట్టిలో జాగా లేకపోవడం ఒకవ్యక్తి సెకండ్ క్లాస్ బెర్తుకు నిలువునా బెడ్డింగ్ పరచి ఉండడం గమనించిన లతిక తన సహజమైన చలాకీ తనం చూపించి "కొంచెం తమ బెడ్డింగ్ మడచి మాకు కూడా కూచునేందుకు స్థలమిచ్చి టిక్కెట్లు ఉన్న అందర్నీ ఒకేదృష్టితో గౌరవించగలరా?" అని వ్యంగ్యంగా పరిహసించింది. దాంతో ఆ పెద్ద మనిషి కళ్ళకువున్న గాగల్స్ సరిచేసుకొని సరస మైన నవ్వుతో "ఆ! ఆ! తప్పకుండా రండి! దయ చేయండి!" అంటూ పరుపు కాస్త మడచి ఆహ్వానించాడు. "జయం మనదే" అన్నట్లు చూస్తూ విజయగర్వంతో కూడిన లతిక మిగతా స్నేహితుల్ని అక్కడ కూచోమని తాను కొంచెం చోటుచేసు కొని ఆ వ్యక్తికి ఎదురుగ్గా ఉన్న బల్లమీద కూచుంది.

కొంతవాదన జరిగిన తర్వాత నడివయస్సులో ఉన్న ఆ వ్యక్తి చదువూ సంస్కారమూ ఉన్నట్టే కనిపించేడు. స్టూడెంట్సు యేదో ఎగతాళిగా అనడమూ అతనూ తీసిపోక చమత్కారంగా జవాబివ్వడమూ జరిగిన తర్వాత కొంతసేపు నిశ్శబ్దంగా గడచింది.

కాని మొట్టమొదటినుంచీ తనవైపే చూస్తూ చెక్కుచెదరకుండావున్న ఆ వ్యక్తి ముఖంలో చిరునవ్వు అలానే ఉండిపోవడం గమనించిన లతిక, కొంచెం చిరాకుపడింది. అందుకనే ఆమె ఎలాగైనా యీ వ్యక్తిని అవమానపరచాలని నిశ్చయించుకొంది.

ఇనుప మృదంగం వాయిస్తున్న రైలు "లాంగుల్యా" వంతెనదాటి వంపులతిరిగి ప్రక్కగా ఊగుతూ పోతున్నది. పెట్టెలో ఉన్న మిగతా ప్రయాణీకులు పేపరు చదువుతూనో, దిక్కులు చూస్తూనో, విద్యార్థి బృందం యొకసెక్కాలు వింటూనో పరధ్యానంగా వున్నారు.

ఇంతలో ఆ వ్యక్తి కిందకువంగి బల్లక్రింద తన మరచెంబు కోసమని చేయిచాచాడు. అతని పొడుగాటి వ్రేళ్ళకు చెంబు వున్నచోట లతిక కోమల పాదపద్మాలు తగిలాయి. విసురుగా చెయ్యి క్షణం పాటు వెనక్కు తగ్గింది. కోపఘూర్ణితమానసయైన లతికకు పగ తీర్చుకొనేందుకు అవకాశం చిక్కింది. దానిని ఆమె వృథాపరచలేదు. ఈ మగవానికి బాగా బుద్ధిచెప్పాలని నిశ్చయించుకొంది. క్రింది పెదవి కొరుకుతూ చివాల్న లేచి నుంచుంది. ఎదురుగా ఆ వ్యక్తి గాగల్స్ సవరించి తనవేపే చూస్తున్నాడు. ముఖంలో మాత్రం మళ్ళీ అదే నవ్వు!

"ఫూల్! ఆడవాళ్ళదగ్గఱ యెలా మెలగాలో కొంచెమైనా తెలీదూ! ఇడియట్..." యీమాట లంటూనే ఆమె అతని చెంపమీద ఊచిపుచ్చుకొని ఒక్కలెంపకాయ కొట్టింది. తోటి ప్రయాణీకులు స్టూడెంట్లు యీ అకస్మాత్ ఉపద్రవానికి హాహాకారాలుచేశారు. గాగల్స్ రివ్వున పైకెగిరి క్రిందపడి ముక్కలు ముక్కలయ్యాయి.

ఆశ్చర్యం! ఆ వ్యక్తి అంధుడు! రెండు కళ్లూ కనిపించవు. లతికకు ఒక్కసారి సాంతము చెమటపోసింది. కాని ఆ వ్యక్తి ముఖంలోని చెక్కుచెదరని ప్రశాంతమైన చిరునవ్వు మాత్రం అలానే ఉండిపోయింది. అందులో కోపమూ లేదు. అవమాన మంతకన్నా లేదు.

లతిక మూర్ఛపోబోయి బల్లమీద చతికిల పడింది. సిగ్గుతో వాలిన ఆమె రెండు కళ్ళూ క్రింద ట్రంకు పెట్టెమీద "సురేంద్రనాధ్. ఎం. ఏ.," అన్న పేరును చదివాయి. ఆమె మస్తిష్కంలో మహా ప్రళయం విజృంభించింది. ఈ వ్యక్తి యెవరో ఆమె యెరుగును. మెట్రిక్ తరువాత తన కోర్కెపై ఇంటరు, బి. యే., చదివించి తీరాలని పట్టుపట్టి ఒప్పించిన నాన్నగారి స్నేహితుడు. తనకు పూజ్యుడు! కాని ఎంత అపరాధం జరిగిపోయింది!

ఆమె కూచున్న రైలు పెట్టె భూమిలోకి క్రుంగి పోతున్నదేమో అనిపించింది. చుట్టూ అంతా తన వైపే చూస్తున్నారు. ఆమె ఒక్క క్షణంపాటు కండ్లు మూసుకొంది. రెండు కన్నీటి బిందువులు అప్రయత్నంగా ఆ కండ్లలోంచి బుగ్గల మీదుగా కారి బరువైన వక్షస్థలంమీద పడినై. పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న ఆమె హృదయం 'ఉసు'రని నిట్టూర్పు విడిచింది.

# పండిట్ నెహ్రూకి కోపం వస్తే—

రెబ్బాప్రగడ సుబ్బలక్ష్మి

పండిట్ నెహ్రూకి కోపం వచ్చినప్పుడు విపరీతంగానే కనిపిస్తూంది. కాని కొద్ది క్షణాల్లోనే తగ్గిపోతుంది. మరుక్షణంలోనే జన సామాన్యానికి సుపరిచితమైన చిరునవ్వు ఆయన ముఖం మీద కనిపిస్తుంది.

రాష్ట్రపునర్నిర్మాణపు నివేదికవల్ల దేశమంతా అల్లకల్లోల మయింది. తత్సంబంధమైన నిర్ణయాల కారణంగా బొంబాయి, బెంగాల్, పంజాబ్ మొదలైన చోట్ల కొట్లాటలు జరిగాయి. ఒకానొక సమయంలో పై గొడవలకి సంబంధించిన ఫైలు కన్పించలేదు. తత్కారణంగా ప్రధాన మంత్రికి కోపం వచ్చింది. ఆ వీరావేశంలో ఆయన కిటికీలు తన్నడం మొదలు పెట్టారు. కిటికీనున్న తెర చింపి పారేశారు. అక్కడ కంటికి కన్పించిన పుస్తకాలు, పత్రికలు సమూలంగా గిరవాటు పెట్టారు. ఈ సంఘటన జరిగిన స్థానం ఎక్కడా అని మీరనుకుంటారు కదూ! బహుశా మీ దృష్టి పథంలో కాంగ్రెస్ కార్యాలయం, ప్రధానమంత్రి నివాసస్థానం ఇటువంటివే మెదలవచ్చు. మీ కల్పనా శక్తికి అందనిచోట-గగన పథంలో-నడుస్తున్న విమానంలో ఇదంతా జరిగింది. గత అక్టోబరు నెల ఒకటవ తేదీని పాలమ్ అంతర్రాష్ట్రీయ విమానదళం ప్రత్యేక విమానంలో ప్రధాన మంత్రిని మద్రాసు, పాండిచ్చేరీ మొదలైన చోట్లకి తీసికెళ్ళింది. ఆయన వెంట ఏకైకపుత్రిక ఇందిర, రైల్వే మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి కూడా ఉన్నారు. ఇంకా ఇతర అధికారులు కూడా అందులో లేకపోలేదు. ప్రయాణం రెండుగంటలు. పొద్దుపోవడానికి నెహ్రూ కాసేపు వార్తాపత్రిక పఠించారు. తరువాత మరేదో పుస్తకం పుచ్చుకున్నారు. విమానం గమ్యస్థానం చేరుకోవడానికి అర్థగంట వ్యవధి ఉంది. పండిట్ జీ చదువుతున్న పుస్తకాన్ని వదిలి విమాన చోదకుడితో సంభాషించడానికి కేబిన్‌లోకి వెళ్ళారు. కాసేపు కిందకిచూస్తూ సృష్టి సౌందర్యాన్ని వీక్షించారు. చదువుతూ వదిలిన పుస్తకం వెదక నారంభించారు. ఎంత వెదికినా అది ఆయనకి కన్పించలేదు. ప్రధానమంత్రి కోపంతో కిటికీ అద్దాన్ని "ధన్ ధన్" మని తన్న నారంభించారు. చెవులు చిల్లులుపడే ఆ శబ్దానికి ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఇటువేపు తిరిగారు. మిగతా ప్రయాణీకుల్తోబాటు వాళ్ళు కూడా చూస్తూ నిలబడ్డారు. పండిట్ జీ జోరు-జోరుగా కిటికీని బాదుతున్నారు. కోపంతో ఆయన ముఖం రక్తవర్ణాని కొచ్చింది. చేతులు